

## నేడే చూడండి

# లేమమారు



# పొగబండి కథలు

ఓలేటి శ్రీనివాసభాను




ఏఎస్ఎమ్ సుబ్రమణ్యానికి తల తీసేసినట్లయింది. తెగ కోపం వచ్చింది. పెళ్లయిన కొత్తలో, అల్లుడి మర్యాదల మత్తులో, నేలకి గజం ఎత్తులో నడుస్తున్న సుబ్రమణ్యాన్ని ఎవరో బలవంతంగా భూమ్మీదికి దించినట్లయింది.

కాపురానికీ, క్వార్టర్సులోకీ అప్పుడే కొత్తగా వచ్చిన భార్య ముందు, నెత్తిమీద పెట్టుకునే అత్త మామల సమక్షంలో వాడెవడో కోన్‌కిస్కాగాడు అంతలేసి మాటలంటాడా? తన ఐడెంటిటీనే సవాలు చేస్తాడా?

అలా అన్నవాడు ఆఫ్ట్రాల్ ఓ డొక్కు సినిమా హాలుకి మేనేజరు. ఆ ఊరంతటికీ అదొక్కటే సినిమా హాలు. అదీ సింగిల్ ప్రొజెక్టరు. అలాంటి హాలుకి వాడు పేరుకే మేనేజరు గానీ, ఏ టు జెడ్ అన్నీ వాడే!

''నమో వేంకటేశా- నమో తిరుమలేశా'' పాట వేసి, కౌంటరు తెరుస్తాడు. పెద్ద సైజు స్టీలు చిప్ప లాంటి బెల్‌ని మోగించి, ప్రొజెక్టరు గదిలోంచి బొమ్మ వేస్తాడు. సినిమా పోస్టర్ల తడకలు కట్టిన రిక్షాలో రికార్డులు వేస్తూ- ''నేడే చూడండి-మీ అభిమాన థియేటర్‌లో'' అంటూ ఊళ్లో ఊరేగుతాడు.

అక్కడితో అయిపోలేదు. రైల్లో ఆ ఊరికి వచ్చే సినిమా రీళ్ల బాక్సుల్నీ, వాల్‌పోస్టర్లనీ-స్టేషన్ నుంచి బయటకు తీసుకురావడం, తిరిగి పంపడం లాంటివీ సదరు మేనేజరు పనులే. సినిమాలో హీరో మారు వేషాలు వేసినట్లుగా, ఆ హాల్లో సినిమాలు వెయ్యడానికి అతను రకరకాల పనులూ, పాపాలూ కూడా చేస్తాడు.

రైల్వే వాళ్లకి అతను చేసే పుణ్యం- ఫ్రీగా సినిమా చూపించడం. రైల్వే స్టాఫ్ మొహాలు దాదాపుగా అతనికి తెలుసు. బుకింగ్ కిటికీలోంచి మొహం చూపిస్తే చాలు- ''ఒరేయ్ సిమ్మాద్రీ రైల్వే స్టాఫ్.. ఒగ్గేయ్'' అని గేటు కీపర్‌కి వినిపించేలా గట్టిగా కేకేస్తాడు. ఆ కేక వినిపించిందీ అంటే స్టేషన్ సిబ్బందికి లైను క్లియర్ దొరికినట్లే!

కానీ ఆరోజు ఏఎస్‌ఎమ్ సుబ్రమణ్యానికి లైన్ క్లియర్ దొరకలేదు. ఊరూ పేరూ లేని స్టేషన్‌లో సూపర్ ఫాస్ట్ ట్రైన్ ఆగిపోయినట్లుగా సుబ్రమణ్యం, అతని భార్యా, అత్త మామలూ బుకింగ్ కిటికీ దగ్గర నిలబడిపోయారు.

అలా నిలబడి పోవడానికి కారణాలు సినిమా రీళ్లన్ని వున్నాయి.

ఆ రోజే సినిమా మారింది. అదీ తొలి ఆట. సాధారణంగా ఆ రోజు ఫ్రీ బాపతు వుండవు. స్టేషన్ సిబ్బందికి ఆ సంగతి తెలుసు. అందుకే పది ఆటలు పడ్డ తరవాతే ఫ్రీగా చూడ్డానికి వెళ్తారు. కానీ ఆ రోజు సుబ్రమణ్యం నాలుగు బుర్రలతో ఫ్రీషోకి వచ్చాడు.

''నమో వెంకటేశా...'' రికార్డు పడీ పడగానే, బుకింగ్ కిటికీ తెరిచీ తెరవగానే, ''స్టేషన్ స్టాఫ్'' అంటూ అర్ధచంద్రాకారం కిటికీ సందులోంచి తన ముఖాన్ని జూమ్ చేశాడు.

అప్పుడే కొబ్బరికాయ కొట్టి, అగరొత్తులు తిప్పిన మేనేజరుకి ఆ రూపంలో బోణీ తగలగానే సెంటిమెంటు దెబ్బతింది. చిర్రెత్తింది. టిక్కెట్ల కోసం క్యూలో నిలబడ్డవాళ్లని రానివ్వకుండా, కిటికీకి అడ్డంగా నిలబడ్డ సుబ్రమణ్యాన్ని, అతని కుటుంబ సభ్యుల్నీ కసురుకున్నాడు.

''బోణీ కాకుండా ఇదేటీ న్యూసెన్సు... ఎనక నున్నోళ్లకి జాగా యియ్యండి..'' గట్టిగా మందలించాడు.

అక్కడ తగిలింది సుబ్రమణ్యానికి..

''నేనెవర్నో తెలుసా? అసిస్టెంట్ స్టేషన్ మాస్టర్ని''

మేనేజరు వినిపించుకోలేదు.

''జరుగు... జరుగు.... పక్కకి జరుగు''

సుబ్రమణ్యం కదల్లేదు.

''ఏయ్ వినిపించడం లేదా? చెప్తుంటే నీక్కాదూ!'' గొంతు పెంచాడు సుబ్రమణ్యం.

''ఏటండీ కదలమంటే కదల్రు? స్టేషన్ స్టాఫ్ మొహాలన్నీ నాకు తెలుసు. మిమ్మల్ని నేనెప్పుడూ సూడలేదు''

''నేనూ నిన్ను చూడలేదు. కొత్తగా వచ్చాను. వారం రోజులే అయింది.''

''అయితే ఒచ్చే వారం రండి... ఇవాళ కుదర్దు''

''ఏం ఎందుక్కుదర్దు?''

''ఎల్లి మీ ఎస్ఎమ్ గారినే అడగండి. తొలిరోజు ఫ్రీగా ఒగ్గరు''

ఆ సమయంలో సుబ్రమణ్యం మామగారు జోక్యం చేసుకున్నారు. ''పోనీ ఒదిలీండి అల్లుడు గారూ. ఇదిగో టిక్కెట్లు తీసుకోండి'' అంటూ నాలుగైదులు ఇరవై రూపాయలు సుబ్రమణ్యం చేతికి అందించాడు.

''మీరుండండి మామయ్యగారూ.. ఎందుకు వదల్డో, ఎలా వదల్డో చూస్తాను'' అంటూ బోర విడిచాడు సుబ్రమణ్యం.

ఆ 'బస్తీమే సవాల్' చూసి అతని భార్యకి భయం వేసింది. ''యావండీ... ఒద్దండీ... పోదాం పదండీ'' అంటూ అతని గడ్డాన్ని తన వైపు తిప్పుకొని బతిమాలింది.

''ఎందుకొచ్చిన గొడవ... పదండి అల్లుడు గారూ'' అంది అత్తగారు.

అంతలో మామగారు చొరవ తీసుకున్నారు. ముగ్గురూ కలిసి సుబ్రమణ్యాన్ని సైడింగులో పెట్టేశారు.

***

రెండు వారాల తరువాత...

ఆ ఊరి డొక్కు హాల్లో సినిమా మారింది. ''ఎన్టీఆర్, ఎస్వీఆర్ పోటీ పడి నటించిన చిత్రం 'పాండవ వనవాసం' నేడే చూడండి. మీ అభిమాన థియేటర్‌లో'' మేనేజర్ గొంతు మైకులో ఊరంతా తిరిగింది. ఆ సాయంత్రం 'నమో వెంకటేశా' రికార్డు పడగానే జనం విరగబడ్డారు. మేనేజరు ఆనందానికి అంతు లేదు. మూడు ఆటలకి సరిపోయే టిక్కెట్లను ఒక్క ఆటకే అమ్మేశాడు. బెల్లు మోగింది. ప్రొజెక్టరు తిరిగింది. అప్పటికి చాలా సార్లు చూసినా, అదే మొదటిసారిగా చూస్తున్నట్లు జనం లీనమైపోయారు.

మాయా ద్యూతంలో పాండవులు ఓడిపోయారు. ద్రౌపదిని నిండు కొలువులోకి ఈడ్చుకు వచ్చిన ఘట్టం. తెరనిండా సావిత్రి. కన్నీంతలు చేసుకుంటూ, కన్నీళ్లు కురిపిస్తూ పాటందుకుంది.

''దేవా... దీనబాంధవా.. అసహాయ రాలరా... కావరా... దేవా'' ఇలా పాట మొదలుకాగానే అలా ఆట ఆగిపోయింది. సింగిల్ ప్రొజెక్టర్ కదూ! రీలు అయిపోయింది. రీలు మార్చేలోగా జనం జంతికలు తిన్నారు. సోడాలు తాగారు. బెల్లు మోగింది. ప్రొజెక్టరు తిరిగింది.

ఒక్కసారి ఈలలు, అరుపులు, తిట్లు...

తెర మీద సావిత్రి లేదు. వస్త్రాపహరణం లాంటిదేదో ఉందిగానీ, అది ద్రౌపదికి జరిగింది కాదు.

''చీర లేని చిన్న దానా... చిగురాకూ వన్నె దానా'' అంటూ ఎన్టీఆర్ మంజుల వెంటపడి, ఘంటసాల మాస్టారి గొంతులో పాడుతున్నాడు. ప్రొజెక్టరు రూమ్‌లోని మేనేజర్‌కి సీన్ అర్థమైపోయింది. ఆ పాట 'వాడే వీడు' సినిమాలోనిది. అంతకు ముందు రోజు వరకూ తమ హాల్లో ఆ సినిమా ఆడింది. అందులోని ఓ రీలు 'పాండవ వనవాసం' రీళ్లల్లో కలిసిపోయింది. ఆట అభాసుపాలై, తెర చిరిగిపోయింది.

***

ముందు రోజురాత్రి ఏమైందంటే....సెకెండ్ షో పూర్తి కాగానే 'వాడే వీడు' సినిమా రీళ్ల బాక్సుని తీసుకొని సినిమా హాల్ గేట్ కీపర్ సింహాద్రి రైల్వే స్టేషన్‌కి వచ్చాడు. దాన్ని పార్శిల్ బుక్ చేయించాడు. షెడ్యూల్ ప్రకారం ఆ బాక్సుని తెల్లవారిగట్ల నాలుగు గంటల అప్ ప్యాసింజర్‌లో లోడ్ చెయ్యాలి. అలాగే మూడు గంటలకు వచ్చే డౌన్ ప్యాసింజర్‌లో 'పాండవ వనవాసం' రీళ్ల బాక్సుని అన్‌లోడ్ చెయ్యాలి. సాధారణంగా ఈ వ్యవహారాల్ని సినిమా హాల్ మేనేజర్ చూసుకొంటాడు. కానీ, ఆ రోజు ఏదో పని పడింది. గేట్ కీపర్ సింహాద్రిని స్టేషన్‌కి పంపించాడు. సింహాద్రి బాగా అలసిపోయినట్లున్నాడు. ప్లాట్‌ఫారమ్ సిమెంటు బెంచీ మీద నిద్రపోయాడు. మూడు గంటల డౌన్ ప్యాసింజర్ వచ్చింది. 'పాండవ వనవాసం' డబ్బా దిగింది. మరో గంట తరువాత అప్ ప్యాసింజర్ వచ్చింది. 'వాడే వీడు' బాక్స్ వెళ్లింది. ఆ గంట తేడాలో ఏఎస్ఎమ్ సుబ్రమణ్యం పథకం వేశాడు. పగ తీర్చుకున్నాడు. సాధారణంగా సినిమా రీళ్ల బాక్సులకి తాళం కప్పలు వేస్తారు. కానీ చాలా సందర్భాల్లో అవి ఏ తాళం చెవితో తిప్పినా ఊడిపడేలా వుంటాయి. ఆరోజు నైట్ డ్యూటీలో వున్న సుబ్రమణ్యం స్టేషన్‌లోని తాళాల గుత్తిని ఉపయోగించాడు. బాక్సులు తెరిచాడు. 'వాడే వీడు', 'పాండవ వనవాసం' రీళ్లల్లో ఒకటి తారు మారయింది.

ఆనాటి నుంచి...

ఏ సినిమా అయినా సరే..ఫస్ట్ డే...ఫస్ట్ షోకి బుకింగ్ కిటికి దగ్గర స్టేషన్ స్టాఫ్ కనిపించగానే....

''ఒరేయ్ సిమ్మాద్రీ రైల్వే స్టాఫ్... ఒగ్గేయ్'' అని సినిమా హాలు మేనేజర్ గొంతు వినిపిస్తుంది.

స్టేషన్ సిబ్బందికి లైను క్లియర్ దొరుకుతుంది.

★